
రెంటాల హనుమత్ ప్రసాద్

# చదువు



సాయంత్రం ఏడు కావస్తున్నది. జులై నెల కావడంతో ఇంకా వెలుగు స్పష్టంగానే వుంది. రాజారావ్ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి తన వాటా ముందుగా నాలుగైదు పోర్షన్ల ఆడవాళ్ల పిల్లలూ గుమిగూడివున్నారు.

అంతవరకూ కలగా పులగంగా మాట్లాడుకుంటున్న వాళ్లందరి ముఖాల్లో ఆందోళన కనబడుతున్నది. రాజారావ్ భార్య రేణుక చుట్టూ దడికట్టినట్లు మూగివున్న వాళ్లంతా ప్రక్కకు తప్పుకున్నారు.

రేణుక ముఖం వర్షించబోయే మేఘంలా వుంది. కళ్ళు ఎర్రబారి కనిపించాయి. రాజారావ్ జరగరానిదేదో జరిగిందన్న గ్రహింపుకొచ్చి ఏం జరిగింది అని అడిగేలోగానే రేణుక పెదవి విప్పింది.

"ఏమండీ! అమ్మాయి కాన్వెంట్ నుండి ఇంతవరకు ఇంటికి రాలేదు." అన్నది వణుకుతున్న స్వరంతో.

రాజారావ్ ఉలిక్కిపడ్డాడు. అతనే

మాత్రం ఊహించని విషయం కావడంతో అతని మనసు మొద్దుబారినట్లయి వెంటనే నోరు పెగల్లేదు.

నాలుగ్గంటలకల్లా కాన్వెంట్ అయిపోతుంది రిక్షావాడే రోజూ తీసుకువెళ్ళి తీసుకువస్తుంటాడు, నెలకు ఇంతని తీసుకుంటూ. కాన్వెంటు పెద్దదూరం కాదు గనుక నాలుగున్నరలోపే తీసుకొస్తాడు పిల్లల్ని.

"రిక్షావాడు తీసుకురాలేదా?" ప్రశ్నించాడు తేరుకుని.

"ఉదయం తీసుకువెళ్లాడు గానీ తీసుకువచ్చేందుకు రాలేదుట" చెప్పింది రేణుక.

రిక్షావాడు నెలకు ఒకటి రెండుసార్లు అలా ఎగ్గొడుతూనే వుంటాడు. అలాంటప్పుడు ఆ రిక్షాలో వెళ్ళే పిల్లలు ఇద్దరు ముగ్గురు ఒక రిక్షావాడ్ని పిలిచి ఎక్కి వస్తుంటారు.

"వాణిని అడగలేమా. మన వందన ఎందుకు రాలేదో" అడిగాడు భార్యను.

రేణుక మాట్లాడలేదు పైటకొంగుతో కళ్లు తుడుచుకుంటూ.

"వాణికోసం నేను వెళ్లాను అంకుల్. బడినుండి రాగానే వాళ్ల మామయ్యతో కలిసి వెళ్లిందిట." చెప్పింది పక్క పోర్షన్ వాళ్లమ్మాయి. రాజారావ్ రేణుకకేసి చురుగ్గా చూశాడు. వాణీ తల్లంటే రేణుకకు పడదు. ఈ సమయంలో కూడా పక్కింటి పిల్లను పురమాయించటం రాజారావ్‌కి కోపం తెప్పించింది.

"మరి ఇంతసేపు ఏం చేస్తున్నావ్" అన్నాడు చిరాగ్గా.

"మీకోసమే ఎదురుచూస్తున్నానండీ" దీనంగా అన్నది రేణుక దుఃఖాన్ని అణుచుకుంటూ.

"బాబూ త్వరగా వెదకండి అన్వేం పున్నేం ఎరుగని పిల్ల. అసలే రోజులు బాగాలేవు చిన్నా పెద్దా లేకుండా ఆడపిల్లల్ని మాయం చేస్తున్నారు. తర్వాత ఏమనుకుంటే ఏంలాభం" పక్కింటి సుబ్బాయమ్మగారు తొందర చేస్తున్నది.

రాజారావ్ చేతిలోవున్న టిఫిన్‌బాక్స్ రేణుకచేతుల్లో పడేసి విసురుగా వెనుదిరిగాడు. బయటకు అడుగుపెడుతూనే సుందరంగారింటికేసి నడిచాడు.

వాకిట్లో నిలబడి పిలిచే సరికి ఆయన బయటకు వచ్చాడు. "రండిసార్! అలా బయటే నిలబడివున్నారేం" అన్నాడు సాదరంగా.

"పరవాలేదండీ! మీ అమ్మాయి వాణి ఇంట్లో వుందా?"

"లేదు సార్. నేనిప్పుడే వచ్చాను. వాళ్ల మామయ్య నాలుగున్నరకే వచ్చి మళ్లా తీసుకొచ్చి దిగబెడతానని తీసు

కెళ్ళాడుట .... ఏం కావాలి?" అడిగాడాయన.

"మరేంలేదండీ! మా వందన ఇంటికి రాలేదా. ఇద్దరూ ఒకే క్లాసుగదా ఏమైనా ఇన్‌ఫర్మేషన్ తెలుస్తుందేమోనని ..." రాజారావ్.

"అరె.... రాలేదా. చిత్రంగా వుందే. బడిలో మాత్రం ఇప్పటిదాకా ఏం చేస్తుందండీ!" అన్నాడు ఆశ్చర్యంతో నోరెళ్ళబెడుతూ.

అంతలో లోపల్నుంచి సుందరం భార్య బయటకు వచ్చింది."మా తమ్ముడి ఇల్లు మరీ దూరం కాదండీ. అక్కడికి వెళ్ళి మా వాణిని అడగండి అన్నయ్యగారూ" అన్నదామె.

"ఇల్లు ఎక్కడండీ"

"ఇదే కాలనీలో వుంది. రామాలయం లేదూ. దాని ముందు వున్న ఇల్లు. రామారావ్ అని ఎ.జి. ఆఫీసులో చేస్తుంటాడు" చెప్పిందావిడ.

"పోనీ ఒక్క నిముషం ఆగండి రాజారావ్‌గారూ. నేనూ డ్రెస్ ఛేంజ్ చేసుకుని వస్తాను. ఇద్దరం వెళ్దాం" అన్నాడు సుందరం.

"థాంక్సండీ!" రామారావుగారిల్లు నాకు తెలుసు. ఓ ఫ్రెండ్ ద్వారా పరిచయం కూడా వుంది" అంటూనే రాజారావ్ రోడ్డుమీద కొచ్చేశాడు.

రామారావు వుండే వీధి అక్కడకు రెండు ఫర్లాంగులదూరం కంటె ఎక్కువ వుండదు. రిక్షలో వెళ్లాలన్నా రోడ్డుమీదకు వెళ్తేకాని దొరకవు. అందుకే రాజారావ్ త్వరత్వరగా నడవసాగాడు.

సుందరం భార్యంటే రేణుకకు ఏ మాత్రం గిట్టదు. దానికి ప్రత్యేకంగా చెప్పుకోతగ్గ కారణమూ లేదు. సర్దుకుపోయే తత్వం ఆడవాళ్లకు తక్కువ. ఇరుగుపొరుగువాళ్లతో సంయమనం లేకపోవడానికి కారణం అదే.

'మా అమ్మాయి వాణి తెలివితేటల ముందు వాళ్లపిల్ల తెలివి ఏపాటిది. మొగుడు ఆఫీసరని ఆవిడ మిడిసిపాటుగానీ ఆ మాత్రానికే తెలివితేటలు పుట్టుకొస్తాయా' అని ఎవరి దగ్గరో సుందరం భార్య అన్నదని రేణుక చెవినవేశారు.

నిజానికి ఆ మాటలు ఆవిడ అన్నదా కాక ఎవరైనా కల్పించి చెప్పారా అన్న ఆలోచనకూడా రేణుకకు లేదు. ఆవిడ మీద యుద్ధం ప్రకటించింది.

ఆ మధ్య వందనను తీసుకువెళ్లేందుకు రోజూ వచ్చేవాడుకాక మరొకడు వచ్చాడు. 'అదేమిటి కొత్తవాడువచ్చాడు. పాతవాడు రావడంలేదా' అడిగాడు తను.

"వాణి వాళ్ళు వెళ్లే రిక్షలో మన అమ్మాయికూడా వెళ్ళడం నా కిష్టంలేదు. అందుకే మాన్పించేశాను" అన్నది రేణుక.

"ఏం పిల్లలేమయినా పోట్లాడు కున్నారా?"

"కాదు. వాణీ తల్లి మన పిల్లని చూసి కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నది మనపిల్ల కన్నా వాణికి నాలుగైదు మార్కులు ఎక్కువ వచ్చినంతమాత్రాన ఏమిటి ఆవిడ గొప్ప. ఏదో చదువుకుంటున్నదిలే అని నేను శ్రద్ధచూపక గానీ నేను పట్టించుకునుంటే క్లాసులో మన వందనే ఫస్టురాదూ...!" అన్నది రేణుక.

"ఏదో వాళ్ళకు తోచినట్లు చదువుకుంటారు. మధ్యలో మీ పెద్దవాళ్ల పంతాలేమిటి" అన్నాడు తను ఆశ్చర్యపోతూ.

"సరేలేండి. మీకు ఆఫీసు విషయాల గొడవలు తప్పితే వేరే లోకంలేదు. పిల్లల గురించి మీరేనాడైనా పట్టించుకున్నారా? బోడి గుమస్తా పెళ్లానికి ఎంత అహంకారం గాకపోతే అంత మాటంటుంది" అన్నది బుసకొడుతూ

"ఏమన్నదేమిటి" అడిగాడు తను.

అప్పుడు చెప్పింది ఆవిడన్న మాటలు. మధ్యలో ఎవరైనా తగాదాలు పెడుతున్నారేమో ఆలోచించకుండా ఏమిటీ కోపశాపాలన్నా వినిపించుకోలేదు. తనకి మాత్రం వాళ్లంటే సదభిప్రాయమే. అర్గ్యుమెంట్ చేసేకొలదీ బయటవాళ్లను వెనకేసుకువచ్చి తననే తప్పు పడ్తున్నానని గోలచేస్తుందని కిమ్మనకుండా వూరుకున్నాడు.

రిజల్టు మార్పుతో ఆ గొడవ సర్దుకుంటుందనుకున్నాడు గాని అలా జరగలేదు. దాని ప్రభావం వందన మీద పడింది.

"వందనా ఇకనుంచి నీవు వాణితో మాట్లాడకు" అంటుంటే ఓసారి చెవిన పడింది.

"అమ్మా! ఎందుకు మాట్లాడొద్దంటున్నావ్. వాణీ నాతో అసలు తగువే పెట్టుకోదు. స్కూల్లో మేమిద్దరం ఒకటే జట్టు. తను తింటానికి ఏం తెచ్చుకున్నా నాకు పెడుతుంది" అన్నది వందన.

"సిగ్గులేదు. దానికి దగ్గర తింటానికి. నీకేం కరువొచ్చింది. ఈ సారి అలాంటి పిచ్చివేషాలేశావంటే తంతాను" అరిచింది రేణుక.

"అదికాదమ్మా! వాణీ...."

"నోర్ముయ్! ఎదురుచెప్పడంకూడానా? నే చెప్పినట్లు చెయ్యి, అసలు నువ్వు వాణితో మాట్లాడినా, వాళ్లింటికెళ్లినట్లు తెలిసినా చంపేస్తాను" అరిచింది రేణుక.

ఒక ప్రక్కగా కూర్చుని ఏదో చదువుకుంటున్న తను కల్పించుకున్నాడు. "రేణూ! పిల్లలతోలి నీ కెందుకు.

వాళ్ళిష్టమొచ్చినట్లు కలసి మెలసి తిరుగుతుంటారు" అంటూ కూతురు పక్షం రాబోయేడు.

"ఇట్లాగే మీ మగవాళ్లు పిల్లల్ని చెడగొట్టేది. నేనేది మంచి అనుకుంటే అది చేస్తాను. దానికేమన్నాకాని మాటలు నూరిపోస్తున్నావా" గయ్యమని లేచింది.

తను నోరు మూసుకోక తప్పలేదు. ఈ పరిస్థితుల్లో తనేమాట చెప్పబోయినా ఆమె చెవికెక్కదని వూరుకున్నాడు.

ఆఫీసునుండి వచ్చేసరికి సాధారణంగా బయటి పిల్లలతోనే ఇంట్లోనే ఆడుకుంటూ చలాకీగా తిరిగే వందన పుస్తకం ముందేసుకుని కూర్చుని వుండటం కనిపించింది.

చూడగానే తను గ్రహించాడు ఇది రేణుక శిక్షలో ఒక భాగమేనని. వందన దీనంగా తనకేసి చూసింది. పలకరింపుగా నవ్వి బట్టలు మార్చుకోవడానికి లోనికెళ్లాడు.

"ఏవేఁ. పుస్తకం ముందేసుకుని దిక్కులు చూస్తున్నావా, లేక చదువుతున్నావా" రేణుక కేక.

"చదువుతున్నాను" హీనస్వరంతో వందన.

"పడుకునేలోపల ఆ పాఠం పూర్తిగా వప్పజెప్పాలి. లేకపోతే వూరుకునేది లేదు".

ఆ పాఠంపూర్తిగా ఇంకా స్కూల్లో చెప్పలేదుగా!" భయంభయంగా వందన గొంతు.

"అయితే మాత్రం చదవగూడదా! నే చెప్పానుగా" మళ్లా రేణుక అదిలింపు.

తను డ్రెస్ ఛేంజ్ చేసుకుని మెల్లగా బయటకొచ్చి సోఫాలో కూర్చున్నాడు బలవంతాన కూర్చోబెట్టినట్లు వందనను చూస్తుంటేనే తెలుస్తున్నది.

లోపలినుండి రేణుక ఒకకప్పు టీ తీసుకువచ్చి చేతికందించి వెళ్లింది. తను మెల్లగా సిప్ చేస్తున్నాడు.

"నాన్నా" పిలిచింది వందన.

"ఏమ్మా! ఏమన్నా అర్థం కాలేదా?" అడిగాడు లాలనగా.

తల అడ్డంగా వూపింది. ఏమన్నట్లు కళ్లతోనే అడిగాడు.

"అందరూ చూడు ఎలా ఆడుకుంటున్నారో. నేనూ కాసేపు ఆడుకుంటాను. అమ్మ ఆడుకోనివ్వడం లేదు" దీనంగా అడిగింది వందన.

ఆ లేతముఖంలో ప్రతిఫలిస్తోన్న దైన్యం తనకే బాధ కలిగించింది. ఆసక్తితో పిల్లల మనసులు చదువువైపు మొగ్గేలా చూడాలిగాని బలవంతంగా వాళ్లను కట్టిపడెయ్యాలనుకోవడం మంచి పద్ధతి కాదు. అది రేణుకకు అర్థమయ్యేలా ఎలా చెప్పటం?

"నాన్నా కాసేపు వెళ్లి ఆడుకోనా" తన మాట కాదనడన్న నమ్మకంతో కాటోలు పుస్తకం మూస్తూనే లేవడానికి సిద్ధపడింది.

అంతలో లోపల్నుండి సుడిగాలిలా రేణుక రానే వచ్చింది. "ఏమిటీ దాని కెదురుగా కూర్చుని కబుర్లుచెబుతున్నారు. దగ్గర కూర్చుని నాలుగుముక్కలు చెప్పకపోగా పైగా చెడగొడుతున్నారా" అంది తన మీద కోపబాణాన్ని సంధిస్తూ.

"అది కాదు రేణూ! ఈ సమయంలో చదువంటూ దాన్నెందుకూ చంపుతావ్. పగలల్లా కాన్వెంట్‌లో పడివచ్చిందిగా. కాసేపు ఆడుకోనివ్వరాదూ" అన్నాడు తను వందన తరపున వకాల్తా పుచ్చుకున్నట్లు.

ఆ మాటలకు రేణుక తనమీద విరుచుకుపడింది. "చూడండి మీరిలా అయినదానికి కానిదానికి కల్పించుకుంటే దాన్నొకదారిలో పెట్టడం నావల్ల కాదు. మీరు అలుసు ఇస్తే నెత్తికెక్కి కూర్చుంటుంది. మీ గొడవలేవో మీరు చూసుకోండి.... వదవ్వే నువ్వు" అంటూ ఓ ఉరుము ఉరిమినట్లు లోనికి వెళ్లిపోయింది.

"చదువుకోమ్మా! మీ అమ్మకి కోపం వస్తుంది" అంటూ తన ఓటమిని అంగీకరించక తప్పలేదు.

ఓ రోజు ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసరికి రోజూ చదువుకుంటూ ఓ మూలగా కూర్చునివుండే వందన కన్పించలేదు. రేణుక రూల్సు ఏమైనా రిలాక్స్ చేసి ఆడుకోనున్నదేమోనని సంతోషించాడు తను.

టీ కప్పు అందుకుని ఒక గుక్క వేశాడు. మంచి రుచిగా నోటికి తగిలింది. రోజూ దైన్యం కూడగట్టిన ముఖంతో వందన తనకేసి చూస్తూ.... నాన్నా నువ్వన్నా అమ్మకు నచ్చచెప్పవూ!" బతిమాలుతున్నట్లుగా అడిగింది.

"ఏం రేణూ! వందనేది. ఈ రోజు కరుణించావా ఏమిటి ఆడుకోవటానికి" అన్నాడు తను.

"దానికన్నా ఆటలంటే మోజు మీకు ఎక్కువయినట్లుందే. హిందీ ట్యూషన్‌కు వెళ్లింది" అన్నది నవ్వుతూ.

అంతవరకూ రుచిగా అనిపించిన టీ ఒక్కసారిగా చిరుచేదయింది. "హిందీ ట్యూషన్ ఏమిటి" అన్నాడు ఆశ్చర్యంగా.

"ప్రాథమికకు కూర్చోపెడదామండీ. మన వీధిలో ఒక ఇల్లు ఖాళీ అయిందిలే. ఆ ఇంట్లోకి ఒక రిటైర్డ్ హిందీ టీచర్ గారు వచ్చారు. నలుగు రైదుగురు పిల్లలు వచ్చి చదువుకుంటున్నారుట. నేనే వెళ్లి మాట్లాడి చేర్పించివచ్చాను.

తెలుగుకన్నా హిందీకే ప్రిఫెరెన్స్ ఎక్కువుందటకూడా...." చెప్పుకు పోతుంది పెద్ద ఘనకార్యం చేసిన దానిలా

"నీ పిచ్చితో దానికి మతిచెడేటట్లుంది" అన్నాడు తను కోపంగా.

"నేనేం చేసినా దాని భవిష్యత్ కోసమేనండీ. ఇప్పటినుండే చదివిస్తే అది డిగ్రీకొచ్చేసరికి భాషాప్రవీణ అయిపోతుంది. శ్రద్ధ వుండాలేగాని అంత కష్టం కూడా లేదంటున్నారు."

ఒడ్డునున్న వాడికి నీటిలోతేం తెలుస్తుంది? అవన్నీ తీర్మించుకోగలిగే వయసుందా దానికి. నీ అభిరుచులు దాని మీద రుద్దుతావేం. రానురాను దానికి చదువంటే విరక్తి పుట్టించేలా వున్నావు" అన్నాడు మందలింపుగా.

"చాల్లేండి మీ తెలివితేటలు. ముందు కాస్త కష్టం అనిపించినా అదే అలవాటవుతుంది. మధ్యలో మీ కేమిటి నొప్పి" అన్నది.

"మరి ఇంత ముందుచూపు వున్న దానివి స్కూల్ ఫైనల్‌తోనే ఎందుకు చదువుకు సున్నా చుట్టినట్లు. పెద్దవాళ్లు ఇంత కట్టుదిట్టాలు చేస్తేనే ఇంత వాళ్లయ్యామా" అన్నాడు కోపంగా.

"చాల్లేండి సంబడం. ఆ రోజుల్లో కాబట్టి మీ చదువులకి ఈ మాత్రం అఫీసరయ్యారు. ఈ రోజుల్లో మీపాటి చదువులకి ప్యూనుఉద్యోగాలు కూడా రావడం లేదు. మన రోజుల్లోలా ఈ రోజుల్లో ఇంకా పెద్దబాలశిక్షలే చదువుతున్నారా. ఏ కాలాన్నిబట్టి ఆ కాలపు చదువులు" తర్కం మొదలెట్టింది ఏ మాత్రం వెనుకడుగేయకుండా.

తన తెలివితేటల్నీ, ప్రయోజకత్వాన్ని కొట్టిపారెయ్యడం అవమాన మనిపించింది కాబోలు.

"రేణూ నా మాటలు నీకు చెవికెక్కవు. దాన్ని మరీ వూపిరికూడా తీసుకోనీయకుండా చంపుతున్నావ్. చిన్న మొక్క దానికదే సహజంగా ఎదుగుతూ పెద్దదవాలేకాని ఎంత పోషణ చేసినా ఒక్కసారి చెట్టుగా ఎదగదు" అన్నాడు నచ్చచెప్పే ధోరణిలో.

"ఈ పిట్టకథలకేంగాని, దాని మంచీ చెడూ మీకన్నా నాకు బాగా తెలుసు. అనవసరంగా మీరు కలగచేసుకుని దాన్ని పాడుచెయ్యకండి. ఏదయినా ముందు నుండే శ్రద్ధ వుండాలి" అంటూనే వంటింట్లోకి విసావిసా వెళ్లిపోయింది.

కొందరికి ఏ విషయమైనా ఒకసారి చెబితే అర్థంకాదు. అర్థమయ్యేందుకు మరికొన్నిసార్లు చెప్పాల్సి వస్తుంది. అయితే అర్థంచేసుకునే ప్రయత్నమే చేయనివాళ్లకి ఎన్నిసార్లు చెప్పినా

ఫలితం వుండదు. అందుకే తనూ రేణుక విషయంలో నిర్లిప్తంగా వుండిపోవడమే ఉత్తమం అనుకున్నాడు. తనకు తానుగా మంచిచెడ్డల్ని గ్రహించగలగాలి.

రేణుకకు వందనపట్ల ఏమాత్రం సడలింపు ధోరణి రాలేదు. ఉదయం లేస్తూనే హడావుడిగా స్కూలుకు వెళ్లేందుకు తయారవటం, తొందర తొందరగా టిఫిన్ నోట్లో వేసుకోవడం, టిఫిన్ బాక్సులో అన్నం పెట్టించు కోవడం, రిక్షా గంట వినటంతోనే పరుగెత్తుకెళ్ళటం, సాయంత్రం మళ్లా వస్తూనే హిందీట్యూషన్‌కి వెళ్లటం, వెంటనే స్నానంచేసి బట్టలు మార్చుకుని పుస్తకం ముందేసుకుని అన్నంతిని పడుకునేదాకా ఒకటే చదువు.

చదువు.... చదువు.... చదువు .... అన్నమాట తప్పితే రేణుక మరోమాట అనదు. సాధారణంగా నెలకు రెండు మూడు సినిమాలయినా అంతా కలసి చూసేవాళ్లు.

అలాంటిది ఈ మధ్య నొకసారి తనే కదిలించాడు రేణుకని. "సినిమా చూసి చాన్నాళ్లయింది. వెళ్దాం" అంటూ.

"కావాలంటే మీరు వెళ్లి చూసిరండి. సినిమాలు అంటూ దాన్ని ఎందుకు చెడ గొడతారు" అంటూ మండిపడింది.

తన మాటలకు ఎంతో ఉత్సాహంతో వెలిగిన వందనముఖం ఆ మాటలతో ముడుచుకుపోయింది. వచ్చే ఏడుపుని భయంతో బలవంతాన దిగమింగు కుంటుంటే తనకి హృదయం ద్రవించింది.

స్వేచ్ఛగా గాలిలో ఎగురుతూ కొమ్మ కొమ్మకు వాలుతూ, గొంతెత్తి పాటలు పాడుతూ ప్రకృతికే వన్నెతెచ్చే కోయిలకు రెక్కలు విరిచి పంజరంలో పడేసినట్లుగా వుండేది వందనను చూస్తుంటే.

ఒకసారి చుట్టంచూపుగా రేణుక అన్నయ్య, వదినా పిల్లలతో వచ్చారు. చాలా కాలానికి కలిసిన ఆనందంతో అంతా కబుర్లలో పడ్డారు. బడినుండి వచ్చిన వందన ఇదే మంచి అవకాశం అనుకుందో ఏమో మెల్లగా పిల్లలతో బయటకు జారుకుంది.

తిరిగివచ్చాక రేణుక అపరకాళిలా తయారయింది. "ఏయ్! పందుదొరికితే చాలు చదువులు ఎగ్గొడదామనే! హిందీ ట్యూషన్‌కు ఎందుకుపోలేదు" అంటూ ఎడాపెడా కొట్టసాగింది.

తను కలుగచేసుకుంటే జరిగే రగడ తెలిసిందే గనుక తనకేం పట్టనట్లు వూరుకున్నాడు గాని రేణు అన్నయ్య సహించలేకపోయాడు. గభాల్న తను రేణు చేతుల్లోనుండి వందనను ఇవతలకు

లాగి "నువ్వు మనిషివా. పశువ్వా. పిల్లలన్నాక ఆటపాటల్లేకుండా ఎలా వుంటారే? రెండురోజులు చదువుకోవంత మాత్రాన కొంపలేం మునగలేదు" అంటూ చివాట్లేశాడు.

అన్నన్న గౌరవంతోనో, భయంతోనో రేణుక నోరెత్తలేదు. అదే తనయివుంటే సాధించి చంపేది. వాళ్లున్న రెండు మూడు రోజులు వందన కాస్త స్వేచ్ఛగా గాలి పీల్చుకుంది. పంజరంనుండి తప్పుకున్న పక్షిలా వాళ్ల పిల్లలతో ఆటపాటల్లో మునిగిపోయింది.

వాళ్లటు వెళ్లారో లేదో వందనకు నాలుగు తగిలించింది. "ఏయ్! బంధువులొస్తే చదువుసంధ్యల్లేకుండా ఎగరటమేనా. ఈ సారిలాంటి వెధవవ్వేషాలేస్తే వొళ్లు చీరేస్తాను. జాగ్రత్త" అంటూ హెచ్చరికలు జారీచేసింది.

పరీక్షలు దగ్గరకొచ్చాయి. తెల్లవారు ఝాము అయిదవుతూనే అలారం పెట్టుకుని నిద్రలేచి వందనను లేపి చదివించడం మొదలుపెట్టింది. పెందలకడనే లేవడం అలవాటులేని వందన గిజగిజలాడిపోయేది. తీరని అలసటతో చాలీచాలని నిద్రతో లేవలేక వేలాడబడిపోయేది.

రేణుక ఏమాత్రం జాలి చూపేది కాదు. వందన నిద్రపోకుండా తను కాపలాగా కూర్చునేది.

"రేణూ! నీ పిచ్చి శృతిమించి రోగాన పడుతుంది. ప్రాణంమీదకొచ్చేలా చదవకపోతేనేం. కలెక్టరవ్వాలా ఏం?" అంటూ విసుక్కున్నాడు.


"ఏం కలెక్టరు కాకూడదా ఏమిటి? అయితే మీకు మాత్రం గర్వంకాదూ" అంటూ ఖాతరుచేయలేదు.

ఈ మనిషికి ఎన్ని చెప్పినా ప్రయోజనం ఏమిటి అనుకున్నాడు

"అదికాదండీ. ఇప్పుడు పోనీలే అనుకుంటే ఎలా? పరీక్షల్లో మన వందన, వాణీకన్నా ఎక్కువమార్కులు తెచ్చుకుని క్లాసులో ఫస్టున రావాలి. ఆవిడ గర్వం కాస్తా ఈ దెబ్బతో అణిగిపోవాలి" అన్నది కోపంతో ముక్కుపుటాలు అదురుతుండగా.

వందనకు ఇన్నాళ్లూ విధించిన శిక్షకు కారణం ఏమిటో అప్పుడు పూర్తిగా బోధపడింది తనకు. పంతంకోసం, ఆవిడకు బుద్ధిచెప్పటంకోసం, తన అహాన్ని వెళ్లడించుకోవటం కోసం వందనను నరకయాతనకు గురిచేసింది. వచ్చిన కోపాన్ని అతికష్టంమీద నిగ్రహించుకోగలిగాడు.

పరీక్షలు మొదలైనాయి. వందనను స్వేచ్ఛగా వూపిరిని కూడా తీసుకోనివ్వడంలేదు రేణుక. ఈ పరిస్థితుల్లో




తన లౌక్యం అంత మంచిదికాదన్న ఉద్దేశ్యంతో పట్టీపట్టనట్లు వూరుకుంటున్నాడు.

"వందనా. పరీక్షలు బాగా రాయమ్మా! నువ్వు క్లాసులో ఫస్టురావాలి. వాణీకన్నా తక్కువ మార్కులు వచ్చాయో ఇంకేం లేదు!" రోజూ పరీక్షకు వెళ్ళేటప్పుడు బెదిరిస్తూవుండేది రేణుక.

రేణుకకు ఎక్కిన ఈ పిచ్చిని ఎలా వదిలించాలా అని రోజూ ఆలోచిస్తూనే వున్నాడు తను.

"అంకుల్.... అంకుల్...." అన్న పిలుపుతో రామారావ్ ఆలోచనలన్నీ చెదిరాయి.

ఎదురుగా వాణి. ప్రక్కనే రామారావ్.

"నమస్తే! ఎందాకా వెళ్తున్నారు?" పలకరింపుగా అన్నాడు అతను.

"మా వందన బడినుండి ఇంకా రాలేదండీ. వెదకడానికి వెళ్తున్నాను. వందనా, వాణీ ఒకే క్లాసు కదా. వాణిని మీరు తీసుకువచ్చారని తెలిసి మీ కోసం వస్తున్నాను.... వాణీ! వందన బడి వదిలాక ఎక్కడికి వెళ్ళిందమ్మా?" అడిగాను ఆత్రంగా.

ఆ పిల్ల ముఖంలో ఆందోళన కనిపించింది. "అంకుల్ నేను వచ్చేప్పుడు క్లాసులోనే కూర్చుని వుంది. వెళ్దాం రమ్మంటే నేను ఇంటికిరాను పొమ్మంది" చెప్పింది వాణి.

"ఎందుకని! స్కూలు పిల్లలుగాని, టీచర్స్‌గాని ఏమయినా అన్నారా?"

"లేదంకుల్! ఎవరూ ఏమీ అన్లేదు. నేను రమ్మన్నా రాను, అమ్మ కొడ్తుంది.. అన్నది. రిక్షావాడు వెళ్ళిపోతాడేమోనని బయటకు పరుగెత్తాను.... అంటీకి చెబుదా మని అనుకున్నాను గాని ఇంటికొచ్చాక మర్చిపోయాను .... సారీ! అంకుల్! త్వరగా స్కూలుకువెళ్ళి చూడండి. అక్కడే వుంటుందేమో!" అన్నది వాణి.

"అమ్మ ఎందుకు కొడ్తుందో చెప్ప లేదూ" అడిగాడు రాజారావ్.

"ఉహూ!" అన్నది.

"సరే. స్కూలుకువెళ్ళి చూస్తాను... వస్తానండీ!" అంటూనే రాజారావ్ గబ గబా అడుగులువేశాడు.

ఒక రిక్షా కనిపించేసరికి అందులో ఎక్కి స్కూలుకి పోనిమ్మన్నాడు. పది హేను నిముషాల్లో స్కూలుదగ్గర ఆగింది రిక్షా. దిగి లోపలికి నడిచాడు.

వెలుతురు మసకమసగ్గా వున్నది. రాజారావ్‌కు వాచ్‌మన్ తారసపడ్డాడు. లోపల "పిల్లలెవరయినా వున్నారా" అడి గాడు అతన్ని.

"ఇప్పటిదాకా ఎవరుంటారండీ! ఎప్పుడో బడి ఇడిసిపెట్టారుగా" అన్నాడు.

"మా అమ్మాయి ఇంటికి రాలేదు. క్లాసులోనే వుండిపోయిందని చెప్తేను..."

"లేదండీ! ఇంతక్షుముందే నేను క్లాసురూం తలుపులన్నీ వేసివచ్చాను. ఎవరూ కనిపించలేదు. ఏ స్నేహితు రాళ్ళతోనయినా వెళ్ళిందేమో" అన్నాడు వాచ్‌మన్

రాజారావు గుండె గుభేల్‌మంది.

ఇంటికి రాకుండా ఎటు వెళ్ళినట్లు? ఎలా వెళ్ళినట్లు? అసలు ఏమయిపోయి నట్లు? అతని కాళ్ళలో వణుకు మొద లయింది.

ఇంటికివెళ్తే అమ్మ కొడ్తుందనటం మేమిటి? రాజారావ్‌కి అంతా అయో మయంగా వుంది. ఏం చెయ్యడానికి పాలుపోవడంలేదు. గబగబా బయటకు నడిచాడు.

ఎటు వెళ్ళాలి? ఎక్కడని వెదకాలి? కొంపదీసి మోసగాళ్ళచేతుల్లో పడితే మళ్ళా దక్కుతుందా? ఈ రోజుల్లో మోసాలు రకరకాలుగా జరుగుతున్నాయి. ఎవరో కొంటెవాళ్ళు చూసి పసిగడితే ఏదోరకంగా ఆరాతీసి ఇంటికి తీసుకురాక పోరు.

అలా కాకుండా ఇంకెవరి చేతుల్లో నన్నా పడితే ఏంకాను?

ఎందుకయినా మంచిది. ముందు వెళ్ళి పోలీసురిపోర్టు ఇవ్వడం మంచిదనుకు న్నాడు. అతని మనసు మనసులో లేదు. పితృహృదయం రకరకాల అనుమానాలతో ఆందోళనలతో కలతబారింది.

గబగబా నడుస్తున్నాడు. నడుస్తూనే తీక్ష్ణంగా పారజూస్తూ పిల్లల ముఖాల్లోకి గుచ్చిగుచ్చి చూసుకుంటూ పోతున్నాడు. కొద్ది నిముషాలు అలా నడిచేసరికి ఒక పార్కు దగ్గరగా వచ్చాడు. ఏదో అనుమానం, ఆశ కలిగాయి.

పార్కులోకి వెళ్ళాడు. జనం పలుచగా అక్కడక్కడా వున్నారు. గబగబా లోపల తిరుగుతూ క్రోటన్‌మాటున చూస్తూ నడుస్తున్నాడు.

ఒక్కసారిగా అతని నడక ఆగిపోయింది. ప్రాణం లేచివచ్చినట్లయ్యింది. ఒక క్రోటన్ పొదప్రక్కనే రెండుకాళ్ళ మధ్య తల వంచుకుని కూర్చునివున్నది వందన. ప్రక్కనే పుస్తకాల సంచీ పడివుంది. రెండంగల్లో అక్కడకు చేరుకున్నాడు.

"వందనా...." పిలిచాడు జీరబోయిన కంఠంతో.

ఉలిక్కిపడ్డట్లుగా వందన తలెత్తి చూసింది. ముఖమంతా కన్నీటి చారికలు గడ్డకట్టివున్నాయి. కళ్ళల్లో నీరు పాతాళ జలలా వుబుకుతున్నది. గభాల్న రాజారావ్ మోకాళ్ళమీద వంగి వందనను చేతుల్లోకి తీసుకుని హృదయానికి హత్తుకున్నాడు. ముఖాన ముద్దులు మురిపించాడు.

వందన వక్కసారిగా ఎక్కిళ్ళు పెడతూ ఏడ్చేసింది.

"ఏమ్మా! యింటికిరాకుండా ఇక్కడ వున్నావేం?.... ఎవ్వరైనా ఏమన్నా అన్నారా తల్లీ!" అన్నాడు ప్రేమపూరితంగా.

వెక్కిళ్ళ మధ్య వందన సమాధానం చెప్పలేకపోయింది.

"చెప్పమ్మా" అడిగాడు.

"నేను.... ఇం.... టి.... కి.... రాను... నాన్నా!" అంది ఎక్కిళ్ళకు ఎగిరిపడుతూ.

"ఎందుకనమ్మా! మేమంటే కోపం వచ్చిందా?" అడిగాడు ఆశ్చర్యంగా.

"అ....మ్మ....చంపేస్తుంది నాన్నా!"

"ఛ....ఛ.... నువ్వేం తప్పు చేశావమ్మా, నువ్వంటే అమ్మకు మాత్రం ప్రాణం కదూ?"

"మరి.... ఇవ్వాళ స్కూల్లో మార్కులు చెప్పారు. వాణీకేమో ఫస్టు వచ్చింది. నాకు నాలుగు మార్కులు తక్కువ వచ్చాయి. నాది సెకండు .... తక్కువొస్తే అమ్మ చంపేస్తానంటిగా" అంది భయంనిండిన కళ్ళతో ఎక్కిళ్ళు పెడుతూ.

ఆ మాటలకు రాజారావు హృదయం ద్రవించింది. కూతుర్ని గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. పెద్దరికపు పంతాలు, పట్టుదల చిన్నారి మనసుల్ని

ఎంతగా గాయపరుస్తాయో, అప్పుడుగాని అతను గ్రహించలేకపోయాడు. కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

"అమ్మా! ఒక్క వాణీకేగా నాకన్నా ఎక్కువ వచ్చింది. మిగతా అందరికన్నా నీకేగా ఎక్కువ మార్కులు వచ్చాయి. బంగారుతల్లీ.... నువ్వు చాలా తెలివయిందానివే! అమ్మ ఏమీ అనదు. నా కన్నా అదే మొద్దురా" అంటూ నుదురు ముద్దాడాడు.

"నీకోసం అమ్మ ఇంటిదగ్గర ఏడుస్తూ కూర్చుందమ్మా! త్వరగా వెళ్ళొద్దూ...." అన్నాడు పైకిలేస్తూ.

"పాపం అమ్మ ఏడుస్తుందా.... మరి త్వరగా వెళ్దాం పద!" అన్నది తల్లి గుర్తుకొచ్చేవరికి అన్ని భయాలు మర్చిపోయి.

ఇల్లు చేరేవరికి రాజారావ్ భుజాల మీదనే నిద్రపోయింది వందన. రేణుక వందనను చూస్తూనే తన చేతుల్లోకి తీసుకొని పట్టలేని ఆనందంతో ముఖాన ముద్దులు కురిపించింది.

వందనకు మెలకువ వచ్చింది. తను తల్లిచేతుల్లో వున్నానని, తనని ప్రేమగా ఎత్తుకున్నదని తెలిసేసరికి అన్ని భయాలు తొలగినట్లున్నాయి. తల్లి మెడను చేతులతో చుట్టేసింది. వందనను ఏమీ అడగొద్దని కళ్ళతోనే సైగచేశాడు రేణుకకు.

స్నానం చేయించి, అన్నం తినిపించేసరికి సోలిపోయి నిద్రలోకి జారిపోయింది. ఆ తర్వాత జరిగిందంతా రేణుకకు చెప్పాడు రాజా.

"రేణూ! డాక్టర్లు, ఇంజనీర్లు కలెక్టర్లు.... ఈ అంతస్థులన్నీ మనకి తెలిసిన తేడాలు. పిల్లల ప్రపంచం వేరు! అందులో ఈ అంతస్థులూ, కల్మషాలూ వుండవు. మన ఆశల్ని, అభిజాత్యాన్ని వాళ్ళ మనసులమీద రుద్దటం రాక్షసత్వం అవుతుంది. ఎదుగుతున్నకొలదీ వాళ్ళంతట వాళ్ళే తెలుసుకుని తమని తామే తీర్చిదిద్దుకుంటారు. సంకుచిత దృష్టితో కర్కశంగా వాళ్ళ బాల్యపు సహజత్వాన్ని మలినం చేయకూడదు" అన్నాడు రాజారావ్ తన వక్షంమీద ఒదిగి పడుకున్న రేణుకతో.

ఆమె వెచ్చని కన్నీటికి అతని వక్షం తడుస్తూవున్నది.

